క్లుప్తంగా

రేపు ఉచిత టీకాలు

భూపాలపల్లి రూరల్: జంతు సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా రేపు(మంగళవారం) పట్టణంలోని జంగేడు పశువైద్యశాలలో పెంపుడు (కుక్కలు) జంతువులకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేయడం జరుగుతుందని పశు వైద్యాధికారి తిరపతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీతో పాటు మండలంలోని పెంపుడు జంతువుల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీఐ కిరణ్ బదిలీ

మహదేవపూర్: మల్టిజోన్ సీఐల బదిలీల్లో భాగంగా మహదేవపూర్ సీఐ కిరణ్‌ను ఆదివారం ఖమ్మం జిల్లా సత్తుపల్లికి బదిలీ అయ్యారు. మూడు సంవత్సరాలుగా తనకు సహాయ సహకారాలు అందించిన మండల ప్రజలకు, అధికారులకు, మీడియా ప్రతినిధులకు సీఐ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీ టికెట్ కేటాయించాలి

మహాముత్తారం: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి ఎంపీ టికెట్ తనకు కేటాయించాలని కోరుతూ మండలంలోని స్తంబంపల్లి(పీపీ)సర్పంచ్ జాడి రాజయ్య రాష్ట్ర ఐటీపరిశ్రమలు శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీదర్‌బాబుకు ఆదివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తను గత 20సంవత్సరాల నుంచి కాంగ్రెస్ పార్టీలో పని చేస్తు పార్టీలో బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, జిల్లా కార్యదర్శిగా పనిచేసిన అనుభవం ఉందన్నారు. అదేవిధంగా పెద్దపల్లి నియోజకవర్గంలో నేతకాని సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు ఎక్కువగా ఉన్నారని తనకు టికెట్ కేటాయించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని శ్రీదర్‌బాబుకు విజ్ఞప్తి చేసినట్లు వినతి పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు.

మండల కమిటీ ఎన్నిక


వెంకన్న, అధ్యక్షుడు


సంజీవ్, ఉపాధ్యక్షుడు

గోవిందరావుపేట: మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా జిల్లా గౌరవ అధ్యక్షుడు మురహరి భిక్షపతి, జిల్లా కన్వీనర్ లకావత్ చందులాల్ హాజరై మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మేడుదుల వెంకన్న, ఉపాధ్యక్షుడిగా దర్శనాల సంజీవ్, గౌరవ అధ్యక్షుడిగా సూరినేని శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శిగా కడారి తిరుపతి, సంయుక్త కార్యదర్శిగా శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.

ద్విచక్రవాహనం రికవరీ

మహదేవపూర్: దొంగతనానికి గురైన ద్విచక్ర వాహనం రికవరీ చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బొమ్మపూర్‌కు చెందిన దేవేందర్ ద్విచక్రవాహనాన్ని అదే గ్రామానికి చెందిన లక్ష్మణ్ చోరీ చేసి మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన సురేందర్ వద్ద కుదువ పెట్టి డబ్బులు తీసుకున్నాడు. కాగా, సురేందర్ హైదరాబాద్‌లో బైక్ నడుపుతుండటంతో ఈ బైక్ చాలన్ దేవేందర్ సెల్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి హైదరాబాద్‌లో బైక్‌ను స్వాధీనం చేసుకొని మహదేవపూర్‌కు తరలించారు. బైక్ చోరీ చేసిన లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా..

- పంచాయతీ రాజ్, స్త్రీ. శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క


ములుగు: చెక్కు అందజేస్తున్న మంత్రి సీతక్క

ములుగు: పెసా కోఆర్డినేటర్లు, మొబిలైజర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా అని పంచాయతీ రాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. పెసా కోఆర్డినేటర్లు, మొబిలైజర్లకు రూ.2 కోట్ల 29 లక్షల 76 వేల గౌరవ వేతనం జంబో చెక్కును జిల్లా కేంద్రంలో మంత్రి సీతక్క ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాల్లో పని చేస్తున్న 1278 మంది పెసా కోఆర్డి నేటర్లు, మొబిలైజర్లకు సంబంధించి గౌరవ వేతనం ఇచ్చినట్లు తెలిపారు. భవిష్యత్‌లో పెసా కమిటీల ఉద్యోగ భద్రత, చట్టం బలోపేతం కోసం కృషి చేస్తానన్నారు. 2019 సంవత్సరం నుంచి 2023 మార్చి వరకు రావాల్సిన పెండింగ్ వేతనాలను ఇప్పించాలని మంత్రిని పెసా కమిటీల వారు కోరగా స్పందించిన ఆమె సంబంధిత కమిషనర్‌తో మాట్లాడి పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాన్ని ఇప్పించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెసా కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు డబ్బుల ముత్యాలరావు, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు అగబోయిన రవి, మండల అధ్యక్షులు కార్తీక్, ఇర్పవెంకట్, కొమురం చంద్రయ్య, ఇండ్ల సమ్మయ్య, వజ్జ రాజు, కోట మల్లేష్, ఇర్ప రాజు, 112 గ్రామ పంచాయతీలకు చెందిన పెసా మొబిలైజర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల విలీన ప్రక్రియ పూర్తి చేయాలి

ములుగు రూరల్: ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీన ప్రక్రియ పూర్తి చేసి అపాయింట్‌మెంట్ తేదీని ప్రకటించాలని ఆర్టీసీ కండక్టర్ ఐక్యవేదిక సెక్రటరీ రవికుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో 10 సంవత్సరాలుగా వేతన సవరణ జరుగలేదని అన్నారు. మహిళల రద్దికి అనుగుణంగా ఆర్టీసీ బస్సులను పెంచడంతో పాటు డ్రైవర్, కండక్టర్ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆనంద్‌రెడ్డి, రంజిత్, మధు, మోహన్, కవిత, ప్రభావతి, లలిత, మాధవి పాల్గొన్నారు.


ములుగు రూరల్: సీతక్కకు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

రోడ్డు నిర్మించాలని వినతి

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు ఏటూరునాగారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్న ఆదివారం ములుగులో వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉందని మంత్రికి విన్నవించామన్నారు. అలాగే జాతీయ రహదారి నుంచి కళాశాల ప్రధాన గేటు వరకు, నూతన భవనం చుట్టూ ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని విన్నవించామన్నారు. ఆయన వెంట అధ్యాపకులు ఉన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు


బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షిస్తున్న పోలీసులు

టేకుమట్ల: మద్యం తాగి వాహనాలు నడపొద్దని ఎస్సై గట్ల సుధాకర్ అన్నారు. మండలంలోని రామకిష్టాపూర్(టి) శివారులో ఆదివారం ఎస్సై గట్ల సుధాకర్ వాహన తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులకు బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారికి, అలాగే వాహన పత్రాలు లేని పలువురికి జరిమానా విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు రోడ్డు నియమాలను పాటించాలన్నారు. ఆయన వెంట ఏఎస్సై ఇంతియాజుద్దీన్, సివిల్, టీఎస్ఎస్పీ కానిస్టేబుళ్లు ఉన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ల అప్పగింత


రేగొండ: ఫోన్ ఇస్తున్న ఎస్సై రవికుమార్

రేగొండ: మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన కందబోయిన భాస్కర్ మొబైల్ కొద్ది రోజుల క్రితం రేగొండకు వచ్చి వెళ్తున్న క్రమంలో ఫోన్ ఎక్కడో పడిపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను గుర్తించారు. కాగా ఆదివారం బాధితుడికి ఎస్సై రవికుమార్ అందజేశాడు.


కాళేశ్వరం: సెల్‌ఫోన్ అందజేస్తున్న కానిస్టేబుల్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరానికి చెందిన మహేష్ సెల్‌ఫోన్ నాలుగు రోజుల కిందట బస్టాండ్ వద్ద పోయింది. దీంతో మహేష్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి సెల్‌ఫోన్‌ను ఆదివారం అందజేశారు. ఎస్సై లక్ష్మణ్‌రావు, కానిస్టేబుల్ రమేష్‌లకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపాడు.

ఘనంగా బల్లాలమ్మ పండుగ


గోదావరి వద్దకు వెళ్తున్న రజకులు


గోదావరి వద్ద పూజలు చేస్తున్న రజకులు

వాజేడు: మండల కేంద్రంలో రజకులు ఆదివారం బల్లాలమ్మ(బండలమ్మ) పండుగను ఘనంగా నిర్వహించారు. ప్రతీ ఇంటి నుంచి పూజకు కావాల్సిన సామగ్రిని డప్పు వాయిద్యాలతో గోదావరికి తీసుకువెళ్లారు. అక్కడ బండలమ్మకు పూజలను చేసిన రజకులు మొక్కులను సమర్పించుకున్నారు. గోదావరికి వచ్చే రజకులకు ఎలాంటి అపాయం, బాధలు కలుగవద్దని గోదావరి తల్లిని కోరుకున్నారు.

వృథాగా 'భగీరథ' నీరు


ట్యాప్ లేక వృథాగా పోతున్న నీరు

మంగపేట: మండలంలోని కమలాపురంలో మిషన్ భగీరథ కులాయిలకు ట్యాపులు లేక పోవడంతో తాగునీరు వృథాగా పోతోంది. మిషన్ భగీరథ పథకంలో భాగంగా గ్రామంలో పైప్‌లైన్ నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ ప్రత్యేక పైప్‌లైన్ నిర్మించి ఇంటింటికీ కులాయి ఏర్పాటు చేశారు. ఎస్సీ కాలనీ, గొల్లవాడ ప్రాంతాల్లో కులాయి కనక్షన్ ఇచ్చిన కాంట్రాక్టర్ నల్లా బిగించకుండా వదిలేయడంతో ప్రజలకు ఉపయోగపడాల్సిన నీరు నిత్యం వృథాగా పోతోంది. దీని కారణంగా ఇళ్లలో ఏర్పాటు చేసిన కులాయిలకు నీరు రావడంతోని స్థానిక ప్రజలు వాపోతున్నారు. సంబంధిత గ్రామ పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి ఎవరికి ఉపయోగపడని కులాయి కనక్షన్ తొలిగించి ఇళ్లలో ఏర్పాటు చేసిన కులాయిలకు నీటి సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

నల్లబెల్లి: దేశవ్యాప్తంగా కార్మికుల హక్కులను నిర్వీర్యం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను తక్షణమే రద్దు చేయాలని రైతు సంఘం జిల్లా నాయకుడు ఈసంపెల్లి బాబు అన్నారు. ఆ సంఘం మండల ముఖ్యకార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ అభివృద్ధికి మూలమైన కార్మికుల హక్కులను కాలరాస్తు మోదీ ప్రభుత్వం నాలుగు చట్టాలను తీసుకొచ్చి ఇబ్బందులకు గురిచేస్తుందని విమర్శించారు. కార్మికుల హక్కులను సాధించుకునేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బొడిగె సమ్మయ్య, కడియాల మనోహర్, పల్లె రవి, ఇస్లావత్ నెహ్రూ, నరేష్ ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


గోవిందరావుపేట: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు


మంగపేటలో..

మల్హర్: మండలంంలోని తాడిచర్ల జెడ్పీ పాఠశాలలో 1995–96 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకుకోని చిన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధలు నేర్పిన అప్పటి గురువులు గట్టు మధుకర్, వానమాముల కృష్ణమాచారి, మల్క భాస్కర్‌రావు, సార్ల రాజయ్య, సుంకరి సారయ్య, మల్క రామ్‌కిషన్‌రావు, కటకం ప్రకాశ్‌రావులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


మల్హర్: తాడిచర్ల పాఠశాలలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

గోవిందరావుపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1984–85, 1985–86వ సంవత్సరం ఇంటర్మీడియట్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎచ్ఈసీ విభాగాలకు చెందిన పలువురు విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇటీవల కాలంలో చనిపోయిన వారి మిత్రులు, అధ్యాపకుల ఆత్మ శాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. సమారు 35 సంవత్సరాల తర్వాత ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకోని కుటుంబ సభ్యులను పరిచయం చేసుకుంటూ కళాశాల అనుభవాలను నెమరు వేసుకున్నారు. అప్పుడు విద్యను బోధించిన రామనాథం మల్లికార్జున్, సుధాకర్, జవహర్ లాల్, సురేందర్, వెంకట్ నరసయ్యలను సన్మానించారు. విద్యార్థులలో ఒకరైన ఎస్ రాజేశ్వరరావు హైకోర్టు జడ్జిగా, మరోకరు టి సాయి మనోహర్ కొత్తగూడెం ఓఎస్‌డీగా పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో, ఏ చంద్రమౌళి పక్క రాష్ట్రంలో ఇంగ్లిష్ లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. వారిని కూడా అధ్యాపకులు, తోటి పూర్వ విద్యార్థులు సన్మానించారు.

మంగపేట: మండలంలోని తిమ్మంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1977–78 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం కార్యక్రమం నిర్వహించుకున్నారు. 46 సంవత్సరాల తరువాత అదే పాఠశాలలో ఒకే చోట కలుసుకున్న సందర్భంగా పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కుటుంబ యోగక్షేమాలను తెలుసుకుని ఒకరి నొకరు అలింగనం చేసుకుని సంతోషాన్ని వ్యక్తం చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు ఎండీ సర్వర్, లింగయ్య, యాకయ్య, రాజిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆకారాధాకృష్ణ, లోకు సత్యం, రాజమౌళి, మక్బుల్, పుల్లయ్య, సురేందర్, కాశీనాథం పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కాటారం: బాబా సాహెబ్ అంబేడ్కర్ సతీమణి మాత రమాబాయి అంబేడ్కర్ 126వ జయంతిని పురస్కరించుకొని ఆల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 11న మల్హర్ మండలం కొయ్యూర్‌లో నిర్వహించనున్న ఆల్ యూత్ చలో కొయ్యూర్ కార్యక్రమ పోస్టర్‌ను ఆదివారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. జయంతి కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికీ మాత రమాబాయి అంబేడ్కర్ జీవిత చరిత్ర మహాగ్రంథాన్ని ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు సొసైటీ నాయకులు తెలిపారు. ఆల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు లింగమల్ల శంకర్, ఏఈడబ్ల్యూఎస్ కాళేశ్వరం జోనల్ అధ్యక్షుడు గంట రాజబాబు, ఏవైయూ జోనల్ అధ్యక్షుడు చింతల కుమార్‌యాదవ్, ఉపాధ్యక్షుడు బండి సుధాకర్, నాయకులు ప్రవీణ్, బొడ్డు రాజబాబు, రాజన్న, మహమ్మద్ మౌలాన, రాజయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


పరామర్శిస్తున్న జెడ్పీటీసీ గొర్రె సాగర్

చిట్యాల: మండలంలోని చల్లగరిగకు చెందిన పోషాల ఓదయ్య, మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన సరిగొమ్ముల సమ్మక్క ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను జెడ్పీటీసీ గొర్రె సాగర్ ఆదివారం పరామర్శించారు. బాధిత కుంటుబాలకు భరోసా కల్పించారు. ఆయన వెంట నాయకులు కర్రె అశోక్‌రెడ్డి, ఎంచర్ల తిరుపతి, కన్నవేన అశోక్ యాదవ్, చిట్యాల సర్పంచ్ పూర్ణచందర్‌రావు, నాయకులు గుర్రం తిరుపతి గౌడ్, మద్రి నరేష్, కట్కూరి రాజేందర్, దాసారపు సృజన్, సరిగొమ్ముల లక్ష్మీతో పాటు తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం

మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన సరిగొమ్ముల మహేష్ తల్లి సమ్మమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా మహేష్ బాల్య మిత్రులు ఆదివారం పరామర్శించి, ఆమె చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులచారు. అనంతరం మహేష్‌కు రూ.13.500 ఆర్థిక సాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో బాల్య మిత్రులు మైదం శ్రీకాంత్, గద్దం వెంకటేష్, దుగ్యాల సందీప్, గుండ సురేష్, అక్బర్, నగేష్, కడెం మల్లేష్, క్యాతం సునీల్, వీరవేని గణేష్, భానుప్రసాద్, అశోక్, సదానందం, రఘుపతి పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోవాలి

దుగ్గొండి: ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా డిగ్రీ చదివిన పట్టభద్రులు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని బీఆర్ఎస్ ఎన్నారై సెల్ ప్రతినిధి, మండల ఓటరు నమోదు ఇన్‌చార్జ్ శానబోయిన రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని గిర్నిబావిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం మాట్లాడుతూ 2020 నవంబర్ వరకు డిగ్రీ పూర్తి చేసిన వారు ఓటు నమోదుకు అర్హులన్నారు. ఓటరుగా నమోదు చేయించుకోవాలనుకునే వారికి తాము సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

కొను'గోల్‌మాల్'..!

- తెల్లబంగారం తూకంలో మోసం
- నష్టపోతున్న రైతులు
- నిలువు దోపిడీ చేస్తున్న దళారులు


పోలీసులతో మాట్లాడుతున్న రైతులు

రేగొండ(కొత్తపల్లిగోరి): తెల్లబంగారం కొనుగోలులో దళారులు గోల్‌మాల్ చేస్తున్నారు. పత్తి పంట చేతికి రావడంతో డేగల్లా రంగప్రవేశం చేశారు. రైతన్నలను తూకాలతో మోసగిస్తున్నారు. ఇంటి వద్దే పత్తిని అమ్ముకోవచ్చనుకున్న రైతులను దళారులు దగా చేస్తున్నారు. కొత్తపల్లిగోరి మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో ఓ వ్యాపారి రైతులను తూకాల్లో మోసం చేసి పత్తి కొనుగోలు చేశాడు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం అల్లమయ్యగుట్టకు చెందిన జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం అల్లమయ్యగుట్టకు చెందిన దళారులు బాజే సంపత్, బొమ్మల సాయి, బొమ్మల గంగారాజ్ గ్రామాల్లో క్వింటాకు రూ.6500 చొప్పున కొనుగోళ్లు చేపట్టారు. మార్కెట్ ధర కంటే ఎక్కవ వస్తుందని ఆశపడ్డ రైతులు దళారులకు అమ్ముకుంటున్నారు. అసలు కథ ఇక్కడే మొదలైంది. క్వింటాకు పది కేజీల చొప్పున అదనంగా పత్తిని తూకం చేస్తూ దగాకు పాల్పడుతున్నారు. పత్తిని తూచే కాంటా రిమోట్ సిస్టం కావడంతో గత రెండు రోజుల నుంచి గ్రామంలోనే కొనుగోళ్లు జరుగుతున్న రైతులు పసిగట్టలేకపోయారు. ఆదివారం పనాసా రాంబాబు అనే రైతు వద్ద పత్తిని కాంటా పెడుతుండగా అనుమానం వచ్చిన రైతు రిమోట్ కాంటా మోసాన్ని గుర్తించి నిలదీయగా అప్పటికే పత్తి లోడ్‌తో ఉన్న వాహనంతో పరారయ్యాడు. మరోక వాహనాన్ని గ్రామస్తులు అడ్డుకుని నిందితులను బంధించారు. పోలీసులు వచ్చి నచ్చజేప్పే ప్రయత్నం చేశారు. కాగా నిందితుల నుంచి డబ్బులు రికవరీ చేసి న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేశారు. రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.


తూకానికి ఉపయోగించిన కాంటా


పత్తితో నిండిన వాహనం

తనిఖీలు నిర్వహించని అధికారులు

లైసెన్సు లేకుండా గ్రామాల్లో వ్యాపారులు కొనుగోలు చేస్తూ, రైతులను మోసం చేస్తున్న సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించడం లేదు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవాడానికి వస్తే తూకం పేరుతో దళారులు మోసం చేస్తూన్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బియ్యం అందజేత


బియ్యం అందజేస్తున్న నాయకులు

పరకాల : పట్టంలోని మదారంకు చెందిన బొట్ల శ్రీలేఖ ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబానికి మదారం అభివృద్ధి కమిటీ, అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో 50 కిలో బియ్యం ఉచితంగా అందించారు. మృతురాలి కుటుంబానికి అండగా ఉంటామని కమిటీ చైర్మన్ పసుల నాగరాజు, సీపీఐ నాయకులు దుప్పటి సాంబయ్య తెలిపారు. అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు నాగెల్లి సంతోష్, సలహాదారుడు దుప్పటి సదయ్య, గూడెల్లి సదన్‌కుమార్, మంద నాగరాజు, గూడెల్లి నాగేంద్ర, కుమార్, భద్రయ్య, రవి, కవిరాజ్, రాజేష్ పాల్గొన్నారు.